క్లుప్తంగా

'గ్రామాభివృద్ధి వివరాలివ్వండి'

మాక్లూర్ : మండలంలో గ్రామాల వారిగా జరిగిన అభివృద్ధి పనుల వివరాలు ఇవ్వాలని సోమవారం మదన్‌పల్లి ఎంపీటీసీ గోవూరు ఒడ్డెన్న ఎంపీడీవో క్రాంతికి దరఖాస్తు అందజేశారు. 2019 జూలై నుంచి మండలాల వారీగా వచ్చిన నిధులు, అభివృద్ధి వివరాలు స. హ చట్టం ప్రకారం అందజేయాలని కోరారు. దరఖాస్తుదారుల్లో మదన్‌పల్లి ఎంపీటీసీ ఒడ్డెన్నతో పాటు 6గురు ఎంపీటీసీల సంతకాలు ఉన్నాయి.

ముగ్గుల పోటీలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత మహిళలకు డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌లను అందజేశారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, టీఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు నీలిమ, సీవో సంతోష్, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్‌లో విద్యార్థుల ప్రతిభ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కాంతి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ కాంతి గంగా రెడ్డి సోమవారం తెలిపారు. ఆర్మూర్ పట్టణంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో పాఠశాలకు చెందిన గీతిక, బిందు, అంజలి, శివాని, మేఘన, శ్రీనిధి, గంగోత్రి, ఆమోద, ఆశ్రిత, సాత్విక, అనన్యలు నిజామాబాద్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



మాక్లూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన వేములపల్లి నాగభూషణంకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సోమవారం సర్పంచ్ వేములపల్లి సుబ్బారావు జీపీ భవనంలో లబ్ధిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు వడ్ల రవి, నాయకులు లక్ష్మినారాయణ, సాయిలు, శ్రీను గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు



బోధన్ : బీఆర్‌ఎస్ నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యపై సోమవారం పట్టణ కేంద్రంలోని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్‌కు బీజేపీ పట్టణ నాయకుల బృందం ఫిర్యాదు చేశారు. సదరు ఎమ్మెల్యే బీజేపీ సతీమణుల విషయమై అసభ్యమైన వ్యాఖ్యలు చేశారన్నారు. బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కందికట్ల వాసు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు యేశాల సూరి, నాయకులు గంగుల శ్రీకాంత్, సతీష్, విజయ్‌బాస్కర్, బాలు, రాజు, గోపాల్, సిద్దు, రవి, శ్రీను,ప్రసాద్‌లు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



రెంజల్(బోధన్): మండలంలోని బాగేపల్లి గ్రామంలో చర్చి ప్రహరి నిర్మాణ పనులకు సోమవారం సర్పంచ్ పాముల సాయులు భూమిపూజ చేశారు. నియోజక అభివృద్ధి నిధుల నుంచి ఎమ్మెల్యే షకీల్ అహ్మద్ రూ. 5 లక్షలు ప్రహరీకి మంజూరు చేశారని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప దేవాలయానికి విరాళం



కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో చేపట్టే అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్ రూ. 50 వేలు విరాళం అందించారు. అనంతరం దాతను ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు సన్మానించారు. బద్రి, చింత గణేష్, మురళి, రాజ్‌వీర్, బద్దం రాజేష్, బాలయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

- ప్రజావాణిలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- 69 ఫిర్యాదులు నమోదు



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, తదితరులు

నిజామాబాద్ నాగారం : ఎంతో ఆశతో తమ సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తారని వాటిని పెండింగ్‌లో ఉంచరాదని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 69 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా, డీఆర్డీవో చందర్, ఆర్డీవో రవికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

● 'మధ్యాహ్న' ఏజెన్సీ సమస్యలు పరిష్కరించాలి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాతో నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు విన్నవించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి మాట్లాడుతూ ఏజెన్సీ కార్మికులకు రూ. 2వేలు పెంచుతున్నట్లు ప్రకటించినా ఇవ్వట్లేదన్నారు. కార్మికులకు ఉద్యోగభద్రత, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు సుజాత,నాగమణి ,సాయమ్మ జిల్లా కార్యదర్శి గంగాధర్ తదితరులున్నారు.

● హైకోర్టు ఆదేశాలు బేఖాతరు

సిరికొండ మండలంలో సర్వే.నం. 532, గడుకోలు సర్వేనెంబర్ 100లో భూ పంపిణీలో పేదలకు ఇచ్చిన పట్టా భూములకు ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారని భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు.

● మంచిప్ప రీడిజైన్‌ను రద్దు చేయాలి

మంచిప్ప రీడిజైన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట మోపాల్ మండలంలోని మంచిప్ప, అమ్రాబాద్, బైరాపూర్ ముంపు గ్రామాల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు విన్నవించారు. ప్రాజెక్ట్ పనులు కొనసాగించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వెంటనే రీ డిజైన్ రద్దు చేసి పాత డిజైన్ ప్రకారమే పనులు కొనసాగించాలన్నారు.

● ఇంటర్ హాల్ టికెట్లు ఇవ్వాలి

ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్న ప్రైవేట్ కళాశాలల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి యూసుఫ్ డిమాండ్ చేశారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

● పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం (బి)లోని నిరుపేదలకు కెనాల్ కట్ట దగ్గర ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు రెండు నెలల నుంచి ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామని చెప్పి తమను మోసం చేశారన్నారు.

● సెకెండ్ ఏఎన్‌ఎంలకు పోస్టింగ్‌లు..

15 నెలలుగా సెకండ్ ఏఎన్‌ఎంలకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని మెరిట్ అభ్యర్థులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఆర్డర్‌కాపీలు ఇవ్వకుండా డీఎంహెచ్‌వో కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారన్నారు. వెంటనే ఆర్డర్‌కాపీలు ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు.

● మండుటెండలోనే పేర్లు నమోదు

వేసవికాలం ప్రారంభం కాగా, ప్రజావాణికి వచ్చే ఫిర్యాదారుల వివరాలను నమోదు చేసుకోవడానికి కలెక్టరేట్ గేటు ఎదుట ప్రత్యేకంగా పోలీస్‌బూత్ ఏర్పాటు చేశారు. అర్జీదారులు ఏ అధికారి కోసం వస్తున్నారు.. వారి సమస్యలను సిబ్బంది నమోదు చేసుకుంటున్నారు. అయితే మండుటెండలో నిలబెట్టి పేర్లు నమోదు చేసుకోవడంపై ఫిర్యాదుదారులు ఆవేదన చెందుతున్నారు.

పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి



రుద్రూర్ (చందూర్) : అధికారులు పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని చందూర్ జెడ్పీటీసీ అంబర్ సింగ్ అన్నారు. చందూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ లావణ్య రాంరెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగింది. సభలో జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ఫోన్‌లో సమస్య విన్నవించినా పరిష్కరించాలన్నారు. అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారంలో పక్షపాతధోరణితో కాకుండా అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులతో సమన్వయంతో వ్యవహరించాలన్నారు. వరుసగా మండల సభకు గైర్హాజరవుతున్న అధికారులపై చర్యలు తీసు కోవాలని వైస్ ఎంపీపీ దశాగౌడ్ డిమాండ్ చేశారు. మేడిపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫారెస్ట్ సరిహద్దులు నిర్ణయించాలన్నారు. చందూర్‌లో జీపీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణంలో జాప్యమెందుకు జరుగుతోందని ప్రశ్నించారు. ఖాళీగా ఉన్న ఆ యా పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఐకేపీ, అటవీ శాఖ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీపీ లావణ్యారాం రెడ్డి, ఎంపీడీవో నీలావతి, ఎంఈవో శాంతకుమారి, మండల వైద్యాధికారి విజయ్ కుమార్, మండల పశువైద్యాధికారి సతీష్, ఏఈపీఆర్ పవన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలనతో బస్సులను నడపాలి



ఆర్టీసీ డిపోలో ఉద్యోగులను సన్మానిస్తున్న రీజినల్ మేనేజర్ ఉషాదేవి

ఆర్మూర్‌టౌన్ : ఆర్టీసీ డ్రైవర్లు సమయపాలన పాటిస్తూ బస్సులను నడిపి ఆర్టీసీకి ఆదాయాన్ని సమకూర్చాలని సంస్థ రీజనల్ మేనేజర్ ఉషాదేవి సూచించారు. టీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆర్మూర్ ఆర్టీసీ డిపోలో సోమవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్థ లాభాల బాటలో నడవడానికి డ్రైవర్లు ప్రతి ట్రిప్పులో అదనంగా ఆరుగురు ప్రయాణికులను చేర్చుకోవాలన్నారు. అనంతరం వేసవిలో చలువ చేయడానికి ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే ఫిబ్రవరి మాసంలో ఆర్టీసీకి అధిక ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లను, ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లను ఆర్‌ఎం ఈ సందర్భంగా నగదు పురస్కారంతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత, ఎంఎఫ్ గంగాకిషన్, నారాయణ, చక్రవర్తి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి నిధులివ్వాలి

నందిపేట్ (ఆర్మూర్): పేదలు కట్టుకుని గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ. 3 లక్షల నుంచి రూ. 5 ఐదు లక్షలు పెంచాలని ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల తహసీల్దార్ అనిల్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.కె.గంగాధర్, దేవన్న, సాయిరెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ మండలం కోమన్‌పల్లిలో సోమవారం పలువురికి సర్పంచ్ నీరడి రాజేశ్వర్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. గ్రామానికి చెందిన అశ్విత్, బండి సాయిలు, లోహిత బాధితులకు సర్పంచ్ చెక్కులను అందజేశారు.

ఆధ్యాత్మికం..

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎ స్ ఆర్మూర్ నియెజక వర్గ ఇన్‌చార్జీ ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి, ఎంపీపీ నర్సయ్య ఎమ్మెల్సీ కవిత బర్త్‌డే సందర్భంగా పూజలు చేశారు. అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు. కమిటీ సభ్యు లు బి.సుమన్, పీసీ గంగారెడ్డి, కిషన్, మీనా చందు, నక్కల లక్ష్మణ్, మల్లయ్య, చిన్నా రెడ్డి, ఆర్మూర్ భజన మండలి భక్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌ను చిత్తశుద్ధితో నిర్వహించాలి

వేల్పూర్ : వేల్పూర్ మండలంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలని ఎంపీపీ భీమ జమున పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం స్వచ్ఛభారత్ గ్రామీణ్ 2.0 కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వేల్పూర్, బాల్కొండ ఎంపీడీవోలు కమలాకర్, సంతోష్‌కుమార్, ఎంపీఈవో జావిద్ హైమద్, ఏపీవో అశోక్, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్స్ రాజు, నరేశ్, మండల గ్రామాల జీపీల కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.



ఘనంగా ఎమ్మెల్సీ కవిత బర్త్‌డే



బోధన్‌లో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి



ఎడపల్లి ఎంపీడీవో ఆఫీస్‌లో కేక్‌కట్ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్ పర్సన్ రజితయాదవ్ తదితరులు



సాలంపాడ్ క్యాంప్‌లో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ బుద్దె సావిత్రి, సర్పంచ్ తూము అంజమ్మ



ఆర్మూర్‌లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న జాగృతి నాయకులు

ఎమ్మెల్సీ కవిత జన్మదినోత్సవాన్ని నియోజక వర్గాల్లో ఘనంగా నిర్వహించారు. నాయకులు ఆయా ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో పండ్లు పంచారు. కేక్‌లు కట్ చేశారు. విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్

రామాలయ ముఖద్వారం ఏర్పాటు కోసం పూజలు



నందిపేట్ (ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలోని రాజా నగర్ ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీరామ ఆలయానికి ముఖద్వారం ఏర్పాటు కోసం సోమవారం శ్రీ కేదారేశ్వర ఆశ్రమం వ్యవస్థాపకులు మంది రాములు మహారాజ్ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రమణరెడ్డి, పెయింటర్ రాజు, బుక నారాయణ, రాజుగౌడ్, శ్రీనివాస్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితేనే భవిష్యత్తు



రెంజల్(బోధన్): పట్టుదలతో చదివితేనే భవిష్యత్తు బాగుంటుందని రెంజల్ సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్ అన్నారు. సోమవారం రెంజల్ ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బలరాం, ఎస్‌ఎమ్‌సీ చైర్మెన్ నాగరాజు, సిబ్బంది పాల్గోన్నారు.

ఫలించని సిండికేటు గాలం

మేకల సంతకు రూ. 55 లక్షల వేలం



వేలంపాట నిర్వహిస్తున్న జీపీ అధికారులు

నవీపేట : మండల కేంద్రంలోని ప్రతి శనివారం నిర్వహించే మేకల సంతకు సోమవారం నిర్వహించిన వేలం పాటలో అధిక మొత్తంలో ఆదాయం సమకూరింది. ప్రతి శుక్ర, శనివారాల్లో నిర్వహించే వారాంతపు కూరగాయలు, మేకల సంతలకు సర్పంచ్ ఆసోల్ల శ్రీనివాస్ ఆధ్యక్షతన వేలంపాటలు నిర్వహించారు. ఈ రెండు సంతల వేలం పాటలో పాల్గొనే వ్యాపారులు రూ. లక్ష చొప్పున డిపాజిట్ చెల్లించాలని నిబంధన విధించారు. దీంతో 87 మంది వ్యాపారులు మేకలు, 32 మంది వ్యాపారులు కూరగాయల సంతల వేలం పాటలో పాల్గొనేందుకు డిపాజిట్ చెల్లించారు.

మునుపెన్నడు లేని విధంగా ఈ యేడాది మేకల సంతకు అనూహ్య ఆదాయం సమకూరింది. గతేడా ది సిండికేట్ అయిన పాటదారులు రూ. 33,70,000లకే వేలం దక్కించుకున్నారు. ఈ ఏడాది సిండికేటుకు తావులేకుండా జరిగిన వేలంలో నవీపేటకు చెందిన షేక్ సలీమ్ రూ. 55,16,000లకు వేలం పాడి సంతను దక్కించుకున్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే వారాంతపు కూరగాయల సంత వేలం పాటలో 32 మంది పాల్గొన్నారు. నవీపేటకు చెందిన సంతోష్ రూ. 16 లక్షలకు వేలాన్ని దక్కించుకున్నారు. జీపీ వాటర్ ప్లాంట్, సులబ్ కాంప్లెక్స్‌లకు వేలం పాటలు నిర్వహించగా కనీస ఆదాయం రాకపోవడంతో ఈనెల 16కు వాయిదా వేస్తున్నట్లు సర్పంచ్ ఆసోల్ల శ్రీనివాస్, ఎంపీవో రామకృష్ణ, కార్యదర్శి గంగాధర్‌లు విలేకరులకు తెలిపారు.

నువ్వు పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

బాల్కొండ: నువ్వు పంటలో యాజమాన్య పద్దతులను పాటించాలని బాల్కొండ వ్యవసాయ అధికారి మహెందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బోదేపల్లి గ్రామంలో నువ్వు పంటను పరిశీలించారు. రసం పీల్చే పురుగుల నివారణ కోసం ఎసిఫేట్ 300 గ్రాములులేదా ఇమీడాక్లో ప్రిడ్ 300 ఎంఎల్ ఏదైన ఒకదానిని రెండు వందల లీటర్ల నీటిలో కలిపిపిచికారి చేసుకోవాలన్నారు. ఆకు ముడత పురుగు, బిహారీ గొంగళి పురుగు నివారణకు క్లోరిఫైరి ఫాస్ 500 ఎంఎల్ లేదా తయోడికార్డ్ 100 గ్రాములు ను పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీకాంత్, సర్పంచ్ నోముల రవి, ఏఈవో నిహారిక , రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ నాగరాజు

ఆర్మూర్‌టౌన్ : ప్రజలకు అందుబాటులో ఉండి ఎటువంటి సమస్యలకు తావు లేకుండా విధులు నిర్వహించాలని సీపీ నాగరాజు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఏసీపీ కార్యాలయాన్ని సోమవారం సీపీ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతినిత్యం పోలీసులు విధులు నిర్వహించేలా చూడాలని ఏసీపీ ప్రభాకర్‌రావును సూచించారు. కార్యక్రమంలో రికార్డులు క్షణంగా పరిశీలించి అభినందించారు. అలాగే సిబ్బంది ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

నవీపేట : జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో మహిళల ఆధ్వర్యంలో సోమవారం సంబురాలు జరుపుకున్నారు. సాంప్రదాయ వస్త్రధారణతో నృత్యాలు చేశారు. ప్రతిభ చూపిన పలువురు మహిళలను సన్మానించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ

నవీపేట : మండల కేంద్రానికి చెందిన సిలిమల గంగాధర్‌ను కులం పేరుతో దూషించిన అట్రాసిటీ కేసులో నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్ సోమవారం విచారణ చేపట్టారు. సిలిమల గంగాధర్ గత నవంబర్ 20న తన పొలంలో పనులు చేస్తుండగా పొట్లూరి సవిత, కరిపె సంతోష్, లక్ష్మినారాయణలు కులం పేరుతో దూషించారన్నారు. సాక్షులను విచారించామని పేర్కొన్నారు. ఈ విచారణలో నార్త్ రూరల్ సీఐ నరహరి పాల్గొన్నారు.

పూర్తయిన ఆలయ పునర్నిర్మాణ పనులు

● పూజలు చేసిన జెడ్పీ చైర్మన్



మాక్లూర్ : మండలంలోని రాంపూర్ వీరాంజనేయ ఆలయంలో సోమవారం మంగిరాములు మహారాజ్ ఆధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు పూజలు ప్రారంభించారు. శిథిలావస్థలో ఉన్న ఆలయానికి జెడ్పీ చైర్మన్ తన నిధుల నుంచి రూ. 30 లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా ఆలయం పునర్నిర్మాణం కాగా తిరిగి పూజలు చేసి ఆయన ఆలయాన్ని ఆరంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ భవాని రఘు, ఆలయ కమిటీ చైర్మన్ జలంధర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు విఠల్‌రావు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

రుద్రూర్: కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండల కేంద్రంలో వేతనాలు అందక అర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న జీపీ కార్మికుడు బాబు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రుద్రూర్ మండల జీపీ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. రుద్రూర్ మండల కేంద్రంలోని చౌరస్తాలో సోమవారం బాబు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు. నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల జీపీ వర్కర్స్ యూనియన్ సభ్యులు శ్రీకాంత్, రాజు, అశోక్, సంతోష్, శంకర్, కృష్ణ, గంగారాం, సాయిలు, సాయవ్వ, లింగవ్వ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో సంతాపం..

మోర్తాడ్: వేతనాలు రాక ఆత్మహత్యకు పాల్పడిన బీబీపేట్ గ్రామ పంచాయతీ కార్మికుడు కొంగరి బాబు ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులు అర్పిస్తూ సోమవారం ధర్మోరా సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు. గ్రామ పంచాయతీ వలస కార్మికులకు సకాలంలో వేతనం ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కారోబార్ సాయన్న, సిబ్బంది శేఖర్, మధు, రాములు, చిన్న సాయన్న తదితరులు పాల్గొన్నారు.

సాగు భూముల సమస్యను పరిష్కరించాలి



బోధన్: సాలూర మండలంలోని మంజీర నది తీరాన ఉన్న మందర్న గ్రామ ప్రభుత్వ సాగు భూముల సమస్యను పరిష్కరించాలని కోరుతు సోమవారం బోధన్ ఆర్డీవో రాజేశ్వర్‌కు సీపీఐ రాష్ట్ర ప్రతినిధి కంజర భూమయ్య, నియోజక వర్గ కార్యదర్శి షేక్‌బాబు, రాజేశ్వర్, పలువురు బాధితులు వినతిపత్రం అందించారు.

రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణలు చెప్పాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రైతు బంధు డబ్బులతో రైతులు మ ద్యం తాగుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు స రికాదని రైతులకు వెంటనే క్షమాపనలు చెప్పాలని కమ్మర్‌పల్లి బీఆర్‌ఎస్ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం నాయకులు పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సీఎం కేసీఆర్ రైతుల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు రేగుంట దేవేందర్, సర్పంచ్ స్వామి, నాయకులు చిన్నా రెడ్డి, సుమన్, బద్దం రాజేశ్వర్, ఏనుగు రాజేశ్వర్ పాల్గొన్నారు.